# మంచి మాటున...

ఎ. శ్యామలారాణి



రాత్రి సుమారు పదకొండుగంటల సమయం అయిఉంటుంది అప్పుడు. నగర వీధిలోని మార్కెట్టు ప్రశాంతంగా నిద్రిస్తూంది. రోడ్డుమీద జనసంచారం లేదు. దూరాన సినిమాహాలులోనించి అస్పష్టంగా వినిపిస్తున్న శోకమయ సంగీతానికి భావయుక్తంగా తల ఆడిస్తూ వస్తున్నాడతను. విశాలమైన తారు రోడ్డుకు ఇరువైపుల దేదీప్యమానంగా వెలిగిపోతున్న మెర్క్యురీలైట్ల వరసను చూడగానే మహారాజ గౌరవార్థమై బారులుతీర్చి నించే దీపధరుల వరసలా అన్న భ్రాంతి కలిగింది. వీరాధివీరునివలె గంభీరంగా, గర్వంగా నవ్వాడు ఒకసారి. 'రోడ్డుమీద తానుతప్ప ఇంకెవరూ లేరు. అందుచేత తనే ఆ మహారాజు! ఇరవై ఏళ్ళుగా తన శూరత ప్రదర్శించి విజయంతో రాజ్యానికి తిరిగివస్తున్న తనకే ఆ ఘనస్వాగతమంతా!'

అతను మరోసారి దిక్కులు పిక్కటిల్లేలా నవ్వాడు. వెంటకుప్పమీది ఎంగిలాకు నాకుదామని ఎంతోదూరం నించి దౌడు కొట్టుకుంటూ అప్పుడే వచ్చి అక్కడ మూతిపెట్టిన గజ్జికుక్క ఆ నవ్వుతో ఝల్లుపడి, తోక ముడుచుకుని, వచ్చినదానికన్న రెట్టింపు వేగంతో అతనికి వెన్నిచ్చి పరుగుతీసింది. అతను మరొకసారి కిలకిల తనలో తాను నవ్వుకున్నాడు.

'నన్ను చూసి బెదిరిపోయింది గజ్జిముండ! మరి, మహారాజుని కదా! పోనీలే. లేనిపోని గొప్పలు తనకెందుకు? పేరులో లేని ఆ "మహా" అన్న ముక్క అనవసరంగా ఎందుకు తగిలించుకోవాలి? ఏమయినా "రాజు" అన్న మాట తన పేరే కదా! రాజారావుట! రాజారావు! ఎవడో తన కా పేరు జాతకం అదీ వేయించి పెట్టినట్టున్నాడు. దిక్కుమాలిన పేరు! ఆ పేరు పెట్టకపోయినా తన రోజులు బాగా వెళ్ళేవేమో! అయినా ఇప్పుడు తన కేమైందని? రోజులు బాగా వెళ్ళాయనే అనుకోవాలి. నరజన్మం ఎత్తికూడా ఒక్క తప్పయినా చెయ్యకుండా ఏభై పదులు నింపుకున్నానన్న ఆత్మసంతృప్తి తన కున్నంతగా ఇంకెవరికైనా ఉంటుందా? సర్కారువాళ్ల ధర్మమా అని ఇంతవరకు నిష్కామ్యంగా దొర్లిపోయాయి తన రోజులు. ఇకపైన స్వతంత్రంగా, హాయిగా బ్రతకమని వదిలిపెట్టారు వాళ్ళు. కాని, తనకేమీ ఆనందంగా లేదు. ఏదో భయం వేస్తూందికూడా. ఇంతవరకూ కుంటువడని తన ఆత్మసంతృప్తికి నీతిగా, నిజాయితీగా ఏ ఎభైఏళ్ళు గడిపానన్న మహదానందానికి ఏమి విఘాతం కలుగుతుందో? ఛీ . . . తానది భరించలేడు. తనకున్నది అది ఒక్కటే! కడుపులో పేగులు కరకరలాడి, 'ప్రాణాలుంటాయా, పోతాయా?' అనిపించినంత చావుబ్రతుకుల సంధిలోకూడా తల్లిలా తనని ఓదార్చి నది, జ్ఞాపకమున్నది ఆ ఒక్క సంతృప్తే. తను లోకంలో సుఖంగా బ్రతకదానికి చూస్తే ఆ సంతృప్తి కిప్పుడే స్వస్తిచెప్పవచ్చు.

'వెధవబ్రతుకు . . . దీనికోసమని ఆ దివ్యానందానికి నీళ్ళధారా? చచ్చినా ఇవ్వను . . . బ్రతుకా! నువ్వు నాశనమయిపో . . . నా ఆనందాన్ని నా ఆత్మలోనే ఉండనీ!' అనుకున్న బక్కచిక్కిన రాజారావుకి భుజాలు పొంగిపోయాయి. ఆ సమయంలో ఎవరైనా అతని ముఖాన్ని పరిశీలనగా చూసిఉంటే, ఆ కనుగవలోని కాంతిముందర ఆరోడ్డుమీది లైట్లవెలుగు దిగదుడుపే అని తప్పక అంటారేమో!

పొడుగాటి, నిర్మానుష్యమైన వీధి చివరన లైట్ల వెలుగులో తళతళ మెరిసిం దొక నల్లని బుల్లికారు.

రాజారావుకి అంతర్గతంగా మెదిలిన ఆలోచన అతనిమీద చక్కని, చిక్కని నిద్రవంలా పనిచేసింది. అత్యానందంలో మత్తుగా అతని శరీరం అతని ప్రమేయం లేకుండానే ముందుకు తోసుకుపోతూంది. కారు దగ్గర అవుతూంది. అతనికి శరీరం పట్టు తప్పింది. కారు కంగారుగా అటు ఇటు తిరిగి, ఎటు తిరిగినా ఆ మనిషినించి తప్పించుకోలేక, చివరికి సడన్‌బ్రేకుతో ఒక్కసారి ఎగిరిపడి, ఎత్తి కుదేసినట్టుగా ఆగింది.

* * *

స్పృహతోచిన రాజారావుకి పట్టుపరుపు, బాలీసుల తాకిడి అతి మెత్తగా, ఆహ్లాదంగా ఉంది. ఆ ప్రదేశమంతా కనులపండువుగా ఉంది. పలచని నీలితెరలమధ్యనించి చంద్రరేఖ విలాసవతివలె తొంగి తొంగి కొంటెచూపులు చూస్తూంది. ఎక్కడినించో సుమధుర సంగీతం గాలిలో అలలు అలలుగా తేలివచ్చి కర్ణపుటాలను సోకి శరీరాన్నే దూదిపింజలా గాలిలో ఎగరగొట్టేస్తున్నట్టుంది.

"మరే . . . ఇంత సులువుగా రాగలిగానన్నమాట స్వర్గానికి! ఓ కారు నడిపిన పుణ్యమూర్తీ! నీకివే నా నమోవాకములు! నాకు స్వర్గప్రాప్తి కలిగించిన నీవు చిరాయువుగా, కీర్తిప్రతిష్ఠలతో వర్ధిల్లు" అని అస్పష్టంగా గొణిగి, తల కొద్దిగా ప్రక్కకు తిప్పాడు.

**మంచితనంతో గోతులు తవ్వడం తేలిక. ఆ గోతుల లోతుల కొలతలు తీయాలని ప్రయత్నిస్తే, వాటిలో బడి కూరుకుపోవడం ఖాయం. సమాజంలో మంచికున్న స్థానం వంచకులకు తెలియదు. వంచితులకే అది గ్రాహ్యం.**

'ఆహా! ఎవ రీ భువనైకసుందరి? నా ముఖంలా ఉందీ ప్రశ్న! స్వర్గంలో ఉండే ఇంత రూపవతి రంభ కాక ఇంకెవరవుతారు?' రాజారావు గుండెలు గుబగుబ లాడాయి. చిన్నగా కనులుతెరిచి ఆ దివ్యసుందర విగ్రహం వైపే తదేకంగా చూస్తూ ఇలా అనుకున్నాడు: 'స్వర్గాధిరోహణం చేసినవారికి రంభోర్వశుల పరిష్వంగ సుఖం లభ్యమవుతుందట! నాన్సెన్స్! అక్కరలేనివాళ్ళనుకూడా బలవంతపెడతారేమిటి చెప్మా! తన కన లాంటివి అనుభవంలేదు! మీదుమిక్కిలి తన వయస్సెంత? తన వయస్సెంత?' నెరసినజుత్తు తడువుకున్నాడు. 'ఈ రంభ నా కూతురిలా ఉంది, ఇంకా మాట్లాడితే మనుమరాల్లా కూడా ఉంది! ఈ సంగతి ఆ రంభకి తట్టిందా లేదా చెప్మా?'

ఆమె అతనిదగ్గిరగా వచ్చి తన సున్నితమైన నిడుపాటి వేళ్లను అతని నుదుటిపై వేసి తడిమింది. కొద్దిగా ముఖం చిట్లించుకున్నాడు రాజారావు. 'తన ఆచారం ప్రకారం తన పని తాను చేసుకుపోదా మను కుంటూంది కాబోలీ పిచ్చి రంభ!' అని గొణుక్కున్నాడు.

ఆమె కొద్దిగా కంగారుగా ఉన్న ముఖభావాలను వీలయినంతవరకు దాచుకుని, శాంతంగా "ఎక్కువ బాధగా ఉందా?" అంది. రాజారావు మళ్లీ ముఖం కూడదీసుకున్నాడు. ఆమెవైపు నిర్లక్ష్యంగా చూసి "స్వర్గానికి వచ్చినా సవతిపోరని ఇక్కడా బాధ లనుభవించాలేమిటి? మరి స్వర్గం గొప్పేమిటయితే? నాకేం బాధగా లేదుకాని, ఇంతకీ నువ్వు రంభవేనా? అయితే చిన్న కబురు చెప్తాను" అని ఆగాడు సమాధానం కోసం.

ఆమె ముఖంలో కంగారంతా మాయమయింది. ఆమెకు సుమారు ఇరవైఏళ్ల వయస్సు ఉన్నా ఎలిమెంటరీ స్కూల్లోని బుజ్జిపాపాయిలా కిలకిల నవ్వింది. ఆ నవ్వు చూస్తూంటే రాజారావుకికూడా పెదిమలు విడిపోయి నవ్వుముఖం పడింది.

'అబ్బ! స్వర్గంలోవాళ్ళు నవ్వితే ఎంత బాగుందో! అందుకే కాబోలు భూలోకంలోవాళ్లంతా స్వర్గం, స్వర్గం అని పడి ఛస్తారు!' లోలోపల అనుకున్నాడు.

ఆమె బలవంతాన నవ్వు ఆపుకుంటూ "భలే, తాతా, భలే! ఇది స్వర్గం! నేను రంభను. మరి, నువ్వెవరూ?" అంది మళ్లీ అదేపనిగా నవ్వుతూ.

"రా . . ." రాజారావు పెదవులు కదపబోతూంటే "నే చెప్పెయ్యనా?" అంది కళ్ళు గుండ్రంగా తిప్పుతూ.

"చెప్పు చూస్తాను" అన్నాడు ఉత్సాహంగా రాజారావు.

"పరమానందయ్యగారి శిష్యపరమాణువ్వి!" ఈసారి పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతూ వెళ్లి సోఫాలో కూలబడిం దా పిల్ల.

"అబ్బబ్బబ్బ! ఇక్కడకూడా వెటకారాలూ, వ్యంగ్యా లేనా?" అని చిన్నగా తల కొట్టుకున్నాడు. చేతికి తలచుట్టూ ఏదో మెత్తగా తగిలింది. 'అరే! కిరీటం పెట్టారులాగుంది' అని చెంగున పక్కమీదనించి దూకి పక్కగా ఉన్న నిలువుటద్దంలో చూసుకున్నాడు. ప్రతిబింబంలో ఏముంది? తన డొక్కుపోయిన ముఖం, ఆ వికారపు ఆకారం గంట్లురొచ్చిప్పలా దర్శనమిచ్చింది. ఎక్కడలేని నీరసం అతణ్ణి వివశుణ్ణి చేసింది. తల చుట్టూ తెల్లని గుడ్డ చుట్టిఉంది. కణతదగ్గిర కొద్దిగ నొప్పి పెడుతూంది. రాజారావుకి జరిగినది లీలగా గుర్తుకువచ్చింది. విమూఢునివలె శూన్యదృక్కులతో నిశితంగా, దీనంగా చూస్తూ "అయితే ఇది స్వర్గం కాదన్నమాట!" అన్నాడు. ఆ మాటలలో ఇమిడిఉన్న దిగులుకు ఆమెకు చాలా జాలి వేసినట్టుంది. మరి ఇందాకటిలా నవ్వలేదు.

"తాతా, వెంట్రుకవాసిలో ప్రమాదం తప్పిందికాని, లేకుంటే ఈపాటికి నువ్వు నిజంగా స్వర్గంలోనే ఉండేవాడివేమో! నేను కటకటాలమధ్య ఉందునేమో! భగవంతుడు రక్షించాడు. అయినా ఇంత పెద్దవాడివి కదా ఏమిటా తెలివితక్కువ పని, చెప్పు. నేను కారును ఎటు తిప్పితే అటే నడిచి, నిజంగా నా ప్రాణాలు తోడేశావు. ఎందుకు, తాతా, అలా చేశావు?"

అతను స్తబ్దుగా ఊరుకున్నాడు. అయ్యో, ఈ లోకంలో ఇంకా ఉండిపోయానే అన్నట్టున్న దిగులు చూపు ఇంకా మారలేదు.

"ఇంతకీ నువ్వెవరు, తాతా?" తిరిగి మరో ప్రశ్న వేసిం దా యువతి.

అతను విరక్త భావభరిత దరహాసాన్ని ఒలికిస్తూ, "నన్నెలా పరిచయంచేసుకుంటే నీకు తెలుస్తుందో తెలియకుండా ఉంది. తీరా పరిచయం చేసుకున్నాక నన్ను చూసి జడుసుకుంటావేమోనని

ఋతుక్రమం ఆలస్యమైతే?

SEENU & CO. MADRAS-21

పెద్ద కెమిస్టులు, డ్రగ్గిస్టులు అందరి వద్దను లభిస్తున్నది

ప్రకటన G. O. Ms. No. 1121 క్రింద అనుమతించబడినది

ఫాస్ఫోమిన్,
శక్తిని పెంపొందించును
ఆకలిని అధికము చేయును
సహనశక్తిని
హెచ్చించును,
శరీరముయొక్క రోగనిరోధక శక్తిని
ఎక్కువ చేయును



అవును —
కుటుంబము అంతటికి
ఫాస్ఫోమిన్
వల్ల ఆరోగ్యము కలుగును.




ఫాస్ఫోమిన్...బి కాంప్లెక్స్ విటమినులు మల్టిపల్
గ్లిసరోఫాస్ఫేట్లుగల ఆకుపచ్చని పండ్ల రుచిగల టానిక్.

SQUIBB
SARABHAI CHEMICALS

shilpi sc 50/67 Tel.


భయంగాకూడా ఉంది. అయినా అదీ మంచిదేలే! నీ మంచితనంతో నన్నిక్కడ కట్టిపడవెయ్యకుండ గెంటేస్తేనే నాకు శాంతి. చెబుతున్నాను విను. నేను . . . నేను పాతికేళ్లపాటు భారత ప్రభుత్వపు అతిథిగా ఉండివచ్చిన రాజారావుని!" అనేసి వెళ్లిపోవడాని కన్నట్లుగా పక్కనీదఉన్న తన మాసిన తువ్వాలు భుజంమీద వేసుకుని లేచాడు రాజారావు.

ఆ అమ్మాయి వింతగా కనులు చికిలించి "అంటే . . ?" అంది.

"ఓహో, నువ్వింకా కిండర్‌గార్టన్ స్టేజిలోనే ఉన్నట్లున్నావు! మామూలు పదాలకే అర్థం తెలియ కుండా ఉంది. అయినా విను. పాతికేళ్లు అంటే ట్వెంటీఫైవ్ ఇయర్స్ జైలు కటకటాలమధ్య గడిపి వచ్చిన రాజాధిరాజుని." పగలబడుతూ నవ్వా డతను.

ఆమె అలా ప్రతిమలా నిల్చునే "జైలు కెందుకు వెళ్లా వసలు?" అంది.

"ఓహో! నువ్వు నిజంగా కె. జి. స్టేజిలోనే ఉన్నావు. అయినా విను. బాంకులో చోరీచేసిన నేరానికి ఫైవ్ ఇయర్స్, మర్డర్ చేసిన నేరానికి ట్వెంటీ ఇయర్స్ — వెరసి ట్వెంటీఫైవ్!" గట్టిగా నవ్విన రాజారావుకి గుండెల్లో నొప్పి వచ్చేసింది. బాధగా గుండెలు చేత్తో పట్టుకుని మెలితిరుగుతూంటే ఆమె అతనికి ఆసరా ఇచ్చి మళ్లీ మంచంమీద కూర్చోపెట్టింది.

"చాలా నీరసంగా ఉన్నావు. లేవకు. ఇప్పుడే వస్తాను. కూర్చో" అని చెప్పి బయటకు వెళ్లి, కొద్దినిమిషాల్లో ఒక గ్లాసుతో బోర్న్‌విటా, కొన్ని పళ్ళు తీసుకువచ్చి అతని ఎదురుగా పెట్టింది. రాజారావుకి నొప్పికూడా కొంచెం సద్దుకుంది. తెల్లగా మిలమిలలాడుతున్న బట్టలతో ఆమె అతని దగ్గరగా వచ్చి "నొప్పి తగ్గిందా?" అని లాలనగా దయామయివలె అడుగుతూంటే రాజా రావు కనులు జలాశయాలయ్యాయి. చిన్నకుర్రాడిలా కళ్లు తుడుచుకుని ఇలా అన్నాడు :

"పాపా, నే నిందాక భ్రమలోపడి ఇది స్వర్గం, నువ్వు రంభవు అనుకున్నాను. ఏం చెయ్యను? ఇప్పు డలా అనుకోలేను. అయినా నువ్వు దేవతాస్త్రీ అంత మంచిదానివే కావచ్చు. కాని, నామీద దయ చూపించకు, పాపా! నాకు భయం వేస్తుంది. నామానాన నన్ను పోనీ!" అంటూ మళ్లీ లేవబోయాడు. ఆమె వింతగా చూస్తూ, లేవవద్దని వారిస్తూ "ఇది ముందు తీసుకో, తాతా!" అంటూ గ్లాసు చేతికి అందించింది.

రాజారావు తిరస్కరించటానికికూడా ఓపికలేక వణుకుతున్న చేతులతో అందుకుని గడగడా తాగేశాడు. ఆమె నిశితంగా అతన్నే చూస్తూ ఆపిలుపండు ముక్కలు కోసి చేతిలో పెట్టింది. అతను శూన్యంలోకి చూస్తూ విధిలేనట్లుగా తింటున్నాడు.

ఆమె అలా చూసి చూసి "తాతా, నువ్వు నిజంగా నేరాలుచేసే జైలుకి వెళ్లావా?" అంది అనుమానంగా. రాజారావు తుండుగుడ్డతో మూతి తుడుచుకుని "నేరాలు చెయ్యటం నిజమైనా, అబద్ధమైనా ఇప్పుడు చేసేదేముంది? పాతికేళ్లు జైల్లో ఉండడంమాత్రం నిజం. ఈవాళే విడుదల అయ్యాను. నే నెవరో చెప్పినా నామీద ఎందుకిలా జాలి చూపిస్తావు?" అని లేచి పోదామనుకుని లేవలేక మళ్లీ కూలబడిపోయాడు.

"ఏమో, నాకు తెలియదు. కాని, నిన్ను

పూస్తుంటే నువ్వెక్కడా నేరస్థుడి వనిపించటంలేదు నాకు. నిజం చెప్పు. నిన్నింత తరిచి తరిచి అడగటానికి మరొక కారణంకూడా ఉంది. అది నా స్వార్థాన్ని ఆశించే అనుకో! నేనొక యువకుని వివాహం చేసుకుందా మనుకుంటున్నాను. అతనిమీద నాకొక నిశ్చితాభిప్రాయం ఉంది. నాకున్న గాఢవిశ్వాసాలు చాలావరకు నిజాలవు తూంటాయి. ఇప్పుడతనిని గురించి రేపటిలోగా నేనొక తీర్మానానికి రావాలి. నాకీ ఒక్కరాత్రి ఇంకా ఆలో చించుకోమని మిగిలిపోయింది. నే నిప్పుడు నీమీద ఏర్పరుచుకున్న అభిప్రాయం సరిఅయినదైతే అది కూడా ఏ అనుమానమూ లేకుండా నమ్ముతాను. లోక మంతా ఎదురు తిరిగినా లక్ష్యపెట్టను. నాకు ఇది ఆఖరి అవకాశం. సరిగ్గా చెప్పు. నువ్వు ఉన్నది ఉన్నట్లు చెప్పకపోయావంటే అనవసరంగా నన్ను బాధపెట్టిన వాడి వవుతావు. నిజంగా నువ్వు నేరాలే చేసిఉంటే నా అభిప్రాయం తప్పని నేను బాధపడతానేమోనని మాత్రం ఏమీ దాచకు" అని ఒక గడియ ఆగింది.

"నిజంగా నీ మనసుమీద నీకంత నమ్మకమా?" అన్నాడు ఆదోలా చూస్తూ అతను.

"ఆహాఁ, నమ్మకమే. కాకపోతే నా జీవనసమస్య పరిష్కరించుకునే సమయం కనక మరొకమారు దృఢపరుచుకుందామనుకుంటున్నాను. నాకు తల్లీ, తండ్రీ లేరు. ప్రఖ్యాత నర్తకిగా నాకు కావలిసినంత పేరుంది. బోలెడంత ఆస్తి ఉంది. నమ్మినవాళ్లంతా నన్ను మోసమే చేస్తున్నారు. అందుచేత నేను నా మనస్సునుతప్ప ఎవ్వరినీ నమ్మడం మానేశాను. నా జీవన సర్వస్వాన్ని ఎన్నుకొనేవేళ, నాకు సర్వవిధాలా అండదండ అయిన నా మనస్సును నమ్ముకునేవేళ నీ నోట వినబోయే మాటలు నాకెంతో ధైర్యాన్ని ఇస్తాయనే అనుకుంటున్నాను. చెప్పు, త్వరగా" అని నుదుట పట్టిన స్వేదబిందువులను పైటచెరగుతో తుడుచుకుని సుదీర్ఘంగా చూసిం దామె.

రాజారావు ముఖం సంతృప్తితో నిండింది. 'నయమే. ఇంకా లేనిపోని మంచితనాలకుపోయి తనను భయ పెట్టడంలేదు. పోనీలే! తన కథేగా చెప్పమంటూంది. అది ఆమెకు ఉపకారమే చేస్తుందిట. అందుచేత తనేమీ తప్పు చెయ్యడంలేదు కనక చెప్పచ్చు' అనుకుని హాయిగా నిట్టూర్చాడు.

వీథి అంతా నిశ్శబ్దంగా ఉంది. పైన సీలింగుఫాను చేస్తూన్న చిన్న చప్పుడుతప్ప మరే శబ్దాలూ వినపడటం లేదు. రాజారావు ఏదో ఆలోచించుకున్నట్టుగా టక్కున మంచంనించి దిగిపోయి నేలమీద చతికిలబడ్డాడు.

"ఫరవాలేదు. ఈ సోఫాలో కూర్చో!" అం దామె.

"వద్దు, పాపా, వద్దు! తీరా నే నెవరినో, ఎక్కడి వాడినో చెప్పాక ఇలాంటి ఇంట్లో గచ్చుమీద కూర్చుండుకు కూడా అర్హతలేదని నువ్వే అనుకుంటావు" అన్నాడు బిడియంగా రాజారావు.

"ఊఁ హూఁ!" చిన్నపిల్లడి మాటలకు నవ్వినట్లుగా నవ్విం దామె. అతడు చెప్పసాగాడు:

"తల్లి ఎవరో, తండ్రి ఎవరో ఎరగను. అనాథశరణా లయపు అధికారే నాకు సర్వస్వం. కొట్టినా, తిట్టినా, పెట్టినా, చేసినా అన్నీ అతడే. నా బుద్ధి వికసిస్తూన్న కొలదీ నేను నేర్చుకున్న మొదటి జ్ఞానపాఠం ఇదే: నా ఎడల ఎవరైనా నిజమైన మంచితనం చూపితే వాళ్ళు నానాబాధలు పడతారు. నేను మంచి అనుకున్నది విషమవుతుంది. చిన్నప్పుడు ఎలిమెంటరీ స్కూల్లో చదువుకునేరోజుల్లో రెడ్డిగారి అబ్బాయి ఒకడు నాతో ఎక్కువస్నేహంగా ఉండేవాడు. మిగిలినవాళ్లంతా నేను దిక్కులేనివాడినని ఎకసక్కెం చేస్తున్నా, నాతో అతడు అతి సన్నిహితంగా ఉండి, నాపై జాలి చూపే వాడు. అందు కా అబ్బాయితో స్నేహం వదిలేశారు కుర్రాళ్లంతా. రెడ్డిగారి కీ సంగతి తెలిసి అతన్ని మంద లించారు. కాని అతను వినకపోవటంచేత ఒళ్లు హూన మయ్యేలా చావగొట్టారు. అక్కడినించి నేనే ఆ కుర్రాడి నించి తప్పుకు తిరిగేవాడిని. అనాథశరణాలయంవాళ్ళు నాకు స్కూలుఫైనలువరకు చదువు చెప్పించి "ఇక నీ తిండి, బట్ట నువ్వు సంపాదించుకుని బ్రతుకు" అన్నారు. నాకింకా చదువుకోవాలని ఉందన్నాను. మాకు తెలియదు పొమ్మన్నారు వాళ్లు. తొలిసారిగా గూడువీడి వచ్చిన పక్షిపిల్లలా బయటికి వచ్చాను నేను. ఒక కరుణామయుడు నా సంగతి అంతా విని దయ తలిచి, నా మార్కులు చూసి సంతోషించి చదువు చెప్పిస్తాను రమ్మని తనతో ఇంటికి తీసుకువెళ్లాడు. కాని, ఆ మహాత్ముని భార్య గడపలో కాలుపెడితే విరగ గొట్టేస్తానంది. ఆయన ఏమీ చెయ్యలేక బాధపడు తూంటే బాధపడకండని చెప్పి, వారి మంచితనానికే జోహార్లర్పిస్తూ ఆ ఇల్లు వదిలి వచ్చేశాను. ఒక పుణ్య స్త్రీ నాకు పట్టెడన్నం పెట్టబోయి భర్తచేత పడచీవాట్లు తిన్నది. ఆ తల్లి సహృదయత కొక అంజలి ఘటించి బయటికి వచ్చేశాను. తరవాత అయిదారు సంవత్సరాలు వారాలు చేసుకుని, అది లేనినాడు అడుక్కు తిని, అదీ దొరకనినాడు ఉపవాసాలు చేసి, వీలయినప్పుడు కూలి పనులు చేసుకుని ఎలాగో బి. ఎ. అనిపించుకున్నాను. ఇంటరు పాసయ్యాక ట్యూషన్లు చెప్పి డబ్బు సంపా దించేవాణ్ణి. ఎలాగయితేనేం, ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడనంటూ ఒక డిగ్రీ పారేశారు." రాజారావు కొద్దిగా ఆగి, వస్తూన్న ఎగ ఊపిరి ఆపుకున్నాడు.

"అమ్మో! బి. ఎ. పాసయావన్నమాట నువ్వు!" అం దామె ఆశ్చర్యంగా.

"ఆఁ" అన్నా డతను పేలవంగా నవ్వేసి. అతడు తిరిగి అన్నాడు:

"ఇక ఏదయినా ఉద్యోగం సంపాదించుకుంటే జీవితంలో స్థిరపడినట్లేననుకుని ప్రయత్నాలు చేశాను. రాజమండ్రిలో ఉద్యోగం వచ్చింది. కాని, రైల్లో నేనొక ప్రమాదంలో చిక్కుకుపోయాను. నేను ప్రయాణంచేస్తున్న పెట్టెలోనే ఒక నగల వర్తకుడు ఎక్కాడు. కొందరు దొంగలుతన్ని దోచుకుని కత్తితో అతని చేతిమీద గాయంచేసి పారిపోయారు. నిద్ర మత్తుతో జోగుతూన్న నాకు ఏదో కోలాహలంతో మెలకువ వచ్చింది. బండి ఆగిపోయింది. పోలీసులు, రైల్వే ఆఫీసర్లు వచ్చి చుట్టుముట్టారు. నేనుకూడా ఏం జరిగిందోనని గాభరాగా లేచి నిల్చున్నాను. ఒకతను నా పాంటుజేబులోనించి వేలాడుతూన్న బంగారు గొలుసు పైకి లాగి "వీడేనండి, దొంగవెధవ! తగల నివ్వండి నాలుగు! ఏమీ ఎరగనట్టు వేషాలేస్తున్నాడు!" అని నన్నో లెంపకాయ కొట్టాడు. ఆ వరసని దబదబ దెబ్బల వర్షం కురిసింది నామీద. నేను దొంగతనం చెయ్యలేదని, ఆ గొలుసు నా జేబులోకి ఎలా వచ్చిందో



[illegible]
([illegible])
ఫోటో — [illegible]

తెలియదని ఎంత మొత్తుకున్నా ఎవ్వరూ వినలేదు.

ఈలోగా దూరంనించి ఇదంతా చూస్తున్న ఓ పెద్ద మనిషి-ఏదో బాంకు హెడ్‌క్లర్కుట-ఆపద్బాంధవుడులా వచ్చి అడ్డుపడి, దొంగలు పారిపోయారని, నేను నిరపరాధినని, తాను అంతకుముందు నిద్రపోతూండగా నన్ను చూశానని చెప్పాడు. అతని పలుకుబడివల్లనో ఏమో నన్ను వదిలివేశారు. నేను వెళ్లి ఆయన కాళ్లు పట్టుకున్నాను. అతడు నన్ను లేవనెత్తి ఊరుకో బెట్టి "అనాథ శరణాలయంవాళ్లంటే అందరికీ లోకువే, నాయనా. మా బాంకులో నీకు ఉద్యోగం ఇప్పిస్తాను, రా! నీకేం ఫరవాలేదు" అని తనతో తీసుకు వెళ్లాడు. రాజమండ్రిలో ఉద్యోగానికి రానని రాసేసి బాంకులో చేరాను.

హెడ్‌క్లర్కు నన్ను అత్యాదరంగా చూసేవాడు. ఆ ఆదరణ ఎందుకో తరవాత బోధపడింది నాకు. కొద్దిరోజుల్లోనే ఆ బాంకులో లక్షరూపాయల దోపిడీ జరిగింది. ఎలా జరిగిందో నాకు తెలియదు. హెడ్‌క్లర్కు పోలీసుల్ని తీసుకువచ్చి నా గది తనిఖీ చేయించాడు. ఆశ్చర్యం! నాఫైలులోనే పదివేల రూపాయల వంద నోట్లు ఉన్నాయి. "అవి దాన్లోకెలా వచ్చాయో నాకు తెలియదు, సార్!" అని ఏడ్చాను.' 'నాకు తెలుసులేవోయ్! ఆరోజు నిన్ను విడిపించి చాలా పొరపాటు చేశాను. మిగిలినదంతా ఎక్కడుంచావో చెప్పు" అని గద్దించా

డతడే. ఏం చెప్పను? నేనేమి చెప్పినా ఎవరూ నమ్మరక్కడ. ఆ సాయంకాలమే నా గదికి వచ్చి నన్ను ఆప్యాయంగా పలకరించి, నాచేత కాఫీ తాగి వెళ్ళిన హెడ్‌క్లర్కు నా ఫైలులో ఆ డబ్బు ఉంచి వెళ్ళాడేమోనంటే నా మాట ఎవడు వింటాడు? నాలాగే మరొక అభాగ్యుణ్ణికూడా పట్టుకున్నారు. వాడిదగ్గర ఓ పదివేలు చిక్కాయి. చెయ్యని నేరానికి అనుభవిస్తున్న శిక్ష వల్ల బాధ, మానసికావేదన మా ఇద్దరమే అర్థం చేసుకోగలిగాము. మేమంతా ఒక దొంగలముఠా అని మిగిలినవాళ్ల పేర్లు చెప్పమని నిర్బంధించారు. నాకు హెడ్‌క్లర్కు పేరే నోటిముందర ఉంది. వాడి రూపమే నా కనులముందు మెదులుతూంది. మొత్తానికి తరవాత ఏం జరిగిందో నాకు తెలియకపోయినా, అయిదేళ్లు శిక్షమాత్రం తెలిసింది. 'ఛీ... పాడులోకం!' అని రోజు కొన్నిసార్లు తిట్టుకునేవాణ్ణి ఆ జైల్లో కూర్చుని.

గడువు తీరాక జైల్లోనించి బయటకి వచ్చాను. 'ఇకనైనా జీవితంలో స్థిరపడాలి. హెడ్‌క్లర్కులా మంచిమాటలాడినవాళ్లని ఎప్పుడూ నమ్మకూడదు. నా మనస్సుని నే నెప్పుడూ మోసగించుకోకుండా నీతిగా, నిజాయితీగా బ్రతికితే అదే నా జీవితానికి సార్థకత' అనుకుని ఆరేళ్లకిందట నాకు లభించిన డిగ్రీ పట్టుకుని వెడతిరిగాను. కాని, ఫలితం శూన్యం. నాజైలు జీవితగాథ తెలిశాక ఎవరూ ఉద్యోగం ఇచ్చేవారుకాదు. నేను దిక్కుమాలినవాడినయ్యాను. 'పోనీ, ఆ జైల్లోనే ఉంచుకుని ఇంత ముద్ద పడేస్తూంటే మరీ పాడులోకంలోనికి వచ్చే అగత్యమే ఉండేదికాదే!' అనికూడా రోదించేవాణ్ణి. నిరుద్యోగం, నిరాహారత నన్ను బాగా కుంగదీశాయి. ఒకసారి మూడురోజులపాటు తిండి దొరక్క కడుపులో పేగులు ఉండ తిరుగుతూంటే రైల్వేపోర్టరుగాకూడా వెళ్లాను. అక్కడ ఒకతను నన్ను గుర్తించి "ఏమోయ్! నిన్ను జైల్లోనించి ఎప్పుడు వదిలేశా"రంటూ పలకరించాడు. నాకు హడలు పట్టుకుంది. నా ఈ అనువు కనిపెట్టి ఇంకెవడు ఏ నేరం నామీద రుద్దుతాడోనని భయపడి అక్కడినించి సెలవు పుచ్చుకున్నాను. ఎవరైనా మంచిగా మాట్లాడితే నాకు తగని భయం వేసేది. హెడ్‌క్లర్కే జ్ఞాపకం వచ్చేవాడు.

ఒకరోజు నాజీవితంమీదే నాకు విసుగు జనించింది. బ్రతికిఉండిమాత్రం ఏం చెయ్యాలింక? ఎవర్ని ఉద్ధరించాలి? నావా రెవరు?

చావటానికి నిశ్చయించుకున్నాను. సరిగ్గా ఈవాళలాగే నాకు అలాంటి ఆలోచన కలగడం, నా ఎదురుగా ఒక కారు రావటం సంభవించింది. కాని, ఎంత ప్రయత్నించినా దానికింద పడలేకపోయాను. కారులోంచి దిగిన ఓ నడివయస్సు వ్యక్తి నన్ను ఎగాదిగా చూసి "ఎవరు నువ్వు?" అన్నాడు తీక్ష్ణంగా.

"నిరుద్యోగిని." సమాధానం ఇచ్చాను.

"ఛస్తే ఉద్యోగం దొరుకుతుందేమిటి?" అతడు వ్యంగ్యంగా నవ్వాడు. నాకు ఒళ్లు మండింది. "ఉద్యోగం దొరుకుతుందని చావడంలేదు. ఈ లోకం పీడ విరగడవుతుందని ఛస్తున్నా" అని నిర్లక్ష్యంగా జవాబిచ్చాను.

"ఓ పెసిమిస్ట్! ఎంతవరకు చదువుకున్నావ్?" అన్నాడు. విసురుగా నా డిగ్రీ చూపించి "దిక్కుమాలిన డిగ్రీకి దహనసంస్కారం చేస్తాను. అగ్గిపుల్లుంటే పారేయండి!" అన్నాను.

"బి. ఎ. ఫస్ట్‌క్లాస్! వాట్? ఛస్తానంటావేం! డిగ్రీకూడా తగలపెడతానంటావ్! మతిపోయిందేమిటి? ఇంకెప్పుడూ అలాంటి మాటలాడకు. నీ నిరాశ నచ్చకపోయినా నీ డిగ్రీ నచ్చిందిలే నాకు. దాన్ని గౌరవించి నీకు జీవనభృతి చూపగలను" అన్నాడు. నా చేతులప్రయత్నంగా జోడించుకున్నాయి. ఆ క్షణంలోనే మళ్లీ తిరిగి బ్రతుకుమీద ఆశ చిగిర్చింది. కాని, నాలుగు తరవాత తెలిసేకంటే ముందు చెప్పేసుకుంటేనే మంచిదని తలచి నా జైలుకథ చెప్పేశాను.

"అయితే నువ్వు నిజంగా నేరం చెయ్యలేదంటావ్!" అన్నాడతను. "నా మనసుమీద ఆన, సార్" అని అతి సన్నిహితమైన, ప్రాణాధికమైన నా మనస్సుమీదే ఒట్టుపెట్టుకున్నాను. అత నది గ్రహించాడో లేదో నాకు తెలియదుకాని, ఒకసారి దీర్ఘంగా, సునిశితంగా నా ముఖంలోకి చూసి ఇలా అన్నాడు:

"నువ్వెవరివటకానీ, ఏం చేయనీ, ఇకనుంచి నావాడివి. నమ్మకంగా ఉండి నా చెప్పుచేతల్లో మసులుకున్నావంటే నీ జీవితం బాగుపడుతుంది. నా ఆఫీసులో ఉన్న ఖాళీలో నిన్ను వేసుకుంటాను. నాతో వచ్చెయ్యి" అన్నాడు.

మంచుముద్దలాంటి ఆ మంచిముక్కలు నాకు ఊపిరి సలపనివ్వలేదు. అప్పుడుమాత్రం ఎందుచేతో నాకు హెడ్‌క్లర్కు మంచితనం జ్ఞాపకానికి వచ్చి భయపెట్టలేదు. "మీరు చెప్పినట్లు వింటాను, సార్. గంజిఅన్నం తిన్నా, పస్తులున్నా నీతిగా, నిజాయితీగా బ్రతకాలన్నదే నా ఆశయం. అది నెరవేరితే నా కింకేమీ అక్కరలేదు" అన్నాను.

అతను చిటికవేసి "అయితే కారెక్కు" అన్నాడు.

వాళ్ల ఆఫీసుకి అతను మానేజరు. మరునాటినుండి నా ఉద్యోగజీవితం ప్రారంభమయింది. అడ్వాన్సుగా యాభై రూపాయలుకూడా ఇచ్చాడు. తన ఇంట్లో గదులు ఖాళీగా ఉన్నాయని, అద్దె కట్టుకోనక్కర్లేకుండా నన్నక్కడే ఉండిపొమ్మని చెప్పాడు. సిరి తా వచ్చిన మోకాలొడ్డుటఎందుకని తలచి సరేనని కృతజ్ఞతలు తెలిపాను. ఆ ఇంట్లో అతను, అతని కూతురు. ఆమె సుమారు నీవయసుదే. కాలేజీలో చదువుకునేది. ఇద్దరే ఉండేవారు. వెనక వసారాకు అనుకునిఉన్న రెండు గదులు ఇచ్చారు నాకు. లోపలినించి ఉన్నదారి మూయించెయ్యండి, సార్ అంటే "చాల్లేవోయ్! పైవాడిలా మాట్లాడకు ఎప్పుడూ నాదగ్గిర. నువ్వు నావాడివని చెప్పేనా!" అని నన్ను ఆదరంగా గదిమారాయన. మంచితనానికి ఎల్లలు లేవనే అనుకున్నాను.

అది వారింటికి నేను వెళ్లిన రెండోరోజుమాత్రమే! రాత్రి సుమారిదే సమయమై ఉంటుంది. నా కెందుకో మెలకువ వచ్చింది. ముందుభాగంలోని మేడమీద గట్టిగా ఆయన గొంతు వినిపిస్తూంది. మధ్య మధ్య ఆ అమ్మాయి ఏడ్పుకూడాను!

"ఏడిస్తే ఏమిటి లాభం? పోనీ, వాడెవడో, ఎక్కడివాడో తెలియదు. నిన్నేమో మోసంచేసి పారిపోయాడు. ఇప్పుడు వాడికోసం ఎక్కడని వెతకను? ఒకవేళ దొరికినా నిన్నేలుకుంటాడ నేమిటి నమ్మకం? అందుకే ఒక మెతకవాణ్ణి నా చేతుల్లో ఇముడ్చుకున్నాను. రెండుమూడు రోజుల్లో నీకూ వాడికీ పెళ్లి జరిపిస్తాను. అప్పుడు పుట్టే పిల్లాడు వాడి పిల్లాడేనని అందరూ అనుకుంటారు. వాడో చవటవాజమ్మ కనక వాడి నోరెత్తకుండా ఏమేమి చెయ్యాలో నాకు తెలుసు. నువ్వు మాత్రం తొందరపడి ఆత్మహత్య ప్రయత్నాలు చెయ్యకు" అని కూతుర్ని ఓదారుస్తున్నా రాయన. చూచాయగా నాకేదో తెలిసింది. కాని తీవ్రంగా నేనా వ్యక్తిని గురించి చెడు ఊహించలేకపోయాను. ఆయన చెప్పిన వాజమ్మ ఎవరోమాత్రం నాకు తెలియదు.

మరునాడు ఆయన లాలనగా నన్ను దగ్గిరికి పిలిచి, కూర్చోపెట్టుకుని "మా అమ్మాయిని పెళ్లి చేసుకుంటావటోయ్?" అనేవరకూ ఆ చవటవాజమ్మను నేనేనని తట్టలేదు నాకు. కొంచెం సిగ్గుపడుతూన్నట్లు ముఖం దించేసుకుని "నా బ్రతుక్కి అదొక్కటే తక్కువ. నాతో హాస్యాలాడుతున్నారేమిటి, సార్!" అన్నాను.

"నీ బ్రతుక్కేం? బంగారురాజులా ఉన్నావు. మా పిల్లనిస్తాను చేసుకో!" అన్నారునొక్కి చెబుతున్నట్లుగా. నాకు ఛళ్లున లెంపకాయ కొట్టినట్లయింది.

> ## నేత్రాలు
>
> స్వర్గముఖంగా చూసే నేత్రాలు ఆవెటువంటివైనా ఎల్లప్పుడూ అందంగా ఉంటాయి.
>
> —శోలర్ట్
>
> • • •
>
> ## నమ్మకం
>
> భగవంతునిపట్ల, స్త్రీపట్ల నమ్మకం కోల్పోవడమే ఆత్మకు సంభవించే విషాదాంశం.
>
> —అలెగ్జాండర్ స్మిత్

"సార్. . . .సార్ . . . మీమంచితనానికి సదా కృతజ్ఞుణ్ణే. కాని మీ అల్లుడి నవుదామన్న ఆశకాని, అర్హతకాని నాకు లేవు. క్షమించండి!" అనేశా నెలాగో బిగబట్టుకుని.

"నే కోరి ఇస్తానంటున్నాను కదుటోయ్!" అన్నారాయన వెలవెలబోతూ. ఆ పాలిపోతూన్న ముఖం వెనుక క్రీనీడలు నన్ను వెక్కిరించాయి.

"అయినాసరే నే చేసుకోను" అన్నాను కొంచెం తీవ్రంగానే.

"ఎందుచేత? నాకు నమ్మకంగా ఉంటానని మాటఇచ్చి ఏం చేస్తున్నావ్?" అన్నారు నాగుపాము బుసకొడుతున్నట్లుగా.

"మాట తప్పినందుకు మన్నించండి. కారణాలు నే చెప్పలేను. మీఅమ్మాయినిమాత్రం చేసుకునేది లేదు" అని గట్టిగా చెప్పేశాను.

దానితో ఆయన తారాజువ్వలా లేచారు. "కృతఘ్నుడా! ఇంత దౌర్భాగ్యుడివి కనకే నీ జీవితం ఇలా తెల్లారింది.

నాతో చెలగాటాలాడుతున్నావు. నాతడాఖా చూపిస్తాలే" అని విసురుగా వెళ్లిపోయా రాయన.

ఆయన కూతుర్ని చేసుకోనన్నంతమాత్రంలో అంత మండిపడటానికి కారణం నీకు తెలిసేఉంటుంది. అయినా అప్పుడు నేనేం చెయ్యగలను? నామీదేమో ఆయన బాగా కోపం తెచ్చేసుకున్నారు. పనిలోనుంచి పీకేసినకంటే పెద్ద తడాఖా ఇంకేం చూపిస్తారు? పోనీలే, నా మానాన నేను రాజీనామా ఇచ్చేసి పోతాననుకుని ఏమేమో ఆలోచించుకుంటూ ఆ రాత్రి కల్లోలిత మనస్కుడనై పడుకున్నాను. మళ్లీ యథాప్రకారం ఎదురు మేడమీద ఏదో గొడవ ప్రారంభమైంది. కాని, తొలిరాత్రి అంత తీవ్రత లేదు. నా పేరు ఆ మధ్యలో వినపడగానే పూర్తిగా విందామన్న కుతూహలం పుట్టి నా గది దాటి బయటికి వచ్చి, కొద్దిగా చెవిఒగ్గి విన్నాను.

నేను నిరాకరించిన సంగతి అప్పటికే ఆమెకు తెలిసి నట్లుంది. ఆమె అతిగా రోదిస్తూంది. ఆయన ఓదార్చుతూ ఇలా అంటున్నారు:

> **స్నేహం**
>
> **మనొక ప్రమాదకర వ్యక్తితో స్నేహం చెయ్యదలచుకుంటే అతను నీ కొక ఉపకారం చెయ్యనివ్వాలి.**
>
> —వార్రెన్ లెవిస్ ఇ. లావెస్
>
> • • •
>
> **మంచితనం**
>
> **మంచి మానవులు ఇద్దరే ఇద్దరు. ఒకడు గిట్టినవాడు, మరొకడు పుట్టనివాడు.**
>
> —చైనా సామెత

"అమ్మాయ్, నేనింకా ఆశ విడవలేదు. నువ్వుకూడా నామాదిరే ఆశావాదివి కావాలి. ఈ భ్రష్టుడు కాదన్నాడని తొందరపడి ప్రాణాలు తీసుకుంటే నేనేం కావాలి, తల్లీ? నీవెనక విలిచిపోయే నిందకూడా భరిస్తూ జీవచ్ఛవంలా బ్రతకాలి. వీడుకాకపోతే మరొకడు. రేపే వీడిని ఉద్యోగంలోంచి ఊడబీకేస్తాను. వీడి స్థానంలో మరొకడెవడయినా అయిఉంటే తప్పక నేనన్నదానికి ఎగిరి గంతులేస్తూ అంగీకరించేవాడు. వీడు వట్టి అభాజనుడు. నువ్వేం బాధపడకు. పడుకోమ్మా!" అని నన్ను తిడుతూ, ఆమెకు ధైర్యవచనాలు చెప్పారు. ఆమె మాటలేమీ వినిపించలేదు నాకు.

నిలబడి నిలబడి కాళ్లు పీకిపోగా మళ్లీ వచ్చి పడుకున్నాను. ఆ ఇంట్లో ఒక్కొక్క నిమిషం ఒక్కొక్క యుగంలా గడుస్తూన్నట్లనిపించింది. 'పోనీలే! నా మనసులో మాటే అన్నా డాయన. రేపు ఉద్యోగంలోనించి నన్ను తీసేస్తాడు. నింద, నిష్ఠూరం లేకుండా పోవచ్చు' ననుకుని తాత్కాలికంగా ఏదో తృప్తిపడి నిద్రకు ఉపక్రమించాను.

అర్ధరాత్రి నా తలుపు కొట్టిన శబ్దమయింది తలుపు తెరిచి చూద్దునుకదా ఎదురుగా ఆయనే! నేను చాలా ఆశ్చర్యపోయాను. ఆయన ముఖం కమిలిపోయిన వంకాయలా ఉంది. కళ్లు చింతనిప్పుల్లా ఉన్నాయి. ఏదో తీవ్రతర బాధ నణచుకుంటూన్నట్లుగా గుటకలు మింగుతూ "మిస్టర్ రాజారావ్! నిన్నీవాళ సాయంకాలం ఏమేమో అనేశాను. పెద్దవాణ్ణి, నామీద కోపం తెచ్చుకోకేం! నువ్వు ఎప్పటికీ నావాడివే. నీమీద నాకేమీ కోపం లేదు. పడుకో. వస్తా. నన్ను క్షమించానన్నావేయ్, చాలు" అన్నారు అదోకరకమైన గంభీరతతో. నాకు ముఖం వులుముకున్నట్లయింది. ఏదో పద్మవ్యూహంలో చిక్కుకున్నట్లు నా మనసు దడదడ కొట్టుకోవడం ప్రారంభించింది. ఇంత మానేజరూ పిల్లికూనలా మెత్తగా ఒదిగిపోయి మళ్లీ నా రెండుచేతులూ పట్టుకుని "క్షమించినట్లేనా?" అన్నారు దీనంగా. నేను విధిలేక "నేను మిమ్మల్ని క్షమించడమేమిటి, సార్! నన్నే మీరు క్షమించా"లన్నాను మొక్కుబడి తీర్చుకున్నట్లుగా.

"వెరీ గుడ్! యు ఆర్ ఎ జంటిల్‌మన్! చాలా థాంక్స్. పడుకో" అనేసి చరచరా ఆ చీకట్లో కలిసిపోయా రాయన. 'తిరిగి ఎందు కింత మంచిగా మారిపోయారా?' అని తర్కించుకుంటూ తలుపువేసుకుని, పక్కమీద వాలానేతప్ప హెడ్‌క్లర్కు మంచితనం అప్పటికి కూడా గుర్తురాలేదు నాకు. మందమతిని! ఠంగు ఠంగుమని మేడమీద గోడగడియారం రెండుసార్లు నెత్తి మొత్తుకుంది. నాకు తెలియకుండానే నిద్రలోకి జారిపోయాను.

రాత్రి సరిగా నిద్రలేని కారణాన కొంచెం పొద్దెక్కేవరకు నాకు మెలకువ రాలేదు. నాకు తెలివి వచ్చేసరికి బయట నుండి నన్నెవరో గట్టిగా పిలుస్తూ, తలుపులు దబదబా బాదుతున్నారు. నా గదిచుట్టూ మహగొడవగా ఉంది. గాభరాగా లేచి తలుపు తెరిచాను.

పోలీసులు!! ఇన్‌స్పెక్టరు నాకు అయిదేళ్లపాటు పరిచితుడే. నన్ను చూసి కరుడుగట్టిన గొంతుకతో "హల్లో, మిస్టర్! గుడ్‌మార్నింగ్. కాసేపలాగే నిల్చో! కాస్త నీ గదికూడా చూసిన తరవాత మనిద్దరం కలిసి పోదాం. నా ప్రాణమిత్రుడివి నువ్వు! నా ప్రాణం పోయినా నువ్వా స్థానం వదలవులే ఇక!" అంటూ పండు మీసాలు కుదుపుతూ అదోలా నవ్వి లోపలికి వచ్చి నా పెట్టె, బట్టలు, షెల్ఫులో ఉన్న నా ఫైలు, పుస్తకాలు చెల్లా చెదరుగా చల్లేస్తూ ఏమో వెతుకుతున్నాడు. అసలేం జరిగిందో, ఏమిటి వెతుకుతున్నారో తెలియక ముచ్చెమటలు పోశాయి నాకు. చివరకు నేనా తొలిరోజు సాయంకాలం గది తుడిచి మూలగా పెట్టిన పెంట పోగులోంచి ఏదో తీసి "వెరీ గుడ్! అయితే మంచి స్థలంలోనే దాచావు. ఫరవాలేదులే. నా కిలాంటివన్నీ అనుభవాలే" అని గుప్పిడి తెరిచి చేతిలో జిగజిగ మెరిసిపోతూన్న రవ్వల నెక్లేసు మానేజరుకి చూపి "సర్, ఇదేనా మీరన్న వస్తువు?" అన్నాడు.

"ఎక్జాక్ట్లీ" అంటూ కళ్లు తుడుచుకుంటున్నా రాయన.

నేను దిగ్భ్రమచెందిపోతూ "ఏమిటి, సార్, ఇదంతా?" అని తడబడుతూ అడిగాను.

"కూతురు చచ్చిపోయిందని ఓమూల కుళ్లిపోతూంటే ఏమీ ఎరిగనట్లు ఆయన్ని అడుగుతావేమిరా, స్కౌండ్రల్! యూ మర్డరర్! నిన్నా అమ్మాయి పెళ్లి చేసుకోనన్నదని పగబట్టి చంపుతావట్రా, రాస్కెల్! ఆయన మంచితనంకొద్దీ నీలాంటి వెధవని చేరదీశారే తప్ప అయిదేళ్లు జైల్లో ఉండివచ్చినవాణ్ణి ఎవరు పంచకి రానిస్తారు?" అంటూ నా చేతికి బేడీలు తగిల్చాడు.

నాకు నోరు పిడచకట్టుకుపోయింది. నన్ను నే నెలాగో అదుపులోకి తెచ్చుకుంటూ "సార్ . . . సార్ . . . ఆయన . . . కోరి చేసుకోమంటేనే వద్దన్నవాణ్ణి అలా చేస్తానని . . . ఎలా అనుకున్నారు, సార్?" అన్నాను. ఇన్‌స్పెక్టరు దానికి సమాధానంగా వ్యంగ్యంగా నవ్వాడు. ఎవరో పెద్దమనిషి మానేజరుతో మాట్లాడుతున్నాడు. మానేజరు దుఃఖాన్ని మింగుకుంటూ మధ్య మధ్య కళ్లు తుడుచుకుంటూ చెబుతున్నాడు: "నాకేం తెలుసనండీ, ఈ వెధవ ఇలా నా కొంప కూలుస్తాడని! పోనీ, తిండిలేక అలమటించిపోతున్నాడు, చదువుకునికూడా ఏమిటీ దౌర్భాగ్యం అని జాలిపడి ఉద్యోగం ఇచ్చి, ఉండడానికి ఇల్లుకూడా ఇచ్చాను. కాని, పాముకి పాలుపోస్తే విషంకా కేమవుతుంది? వీడు ఏకంగా మా అమ్మాయినే దక్కించేసుకుని నా అల్లుడయి నెత్తెక్కిపోదామని ప్లాను వేసుకున్నాడు. మా అమ్మాయితో ఏదో అడ్డదిడ్డంగా పేలాట్ట! కోపంలో ఓ లెంపకాయ కొట్టి, ఈమా రిలా చేస్తే నాతో చెప్పి ఉద్యోగం ఊడగొట్టించేస్తానందిట! ఒక్క రోజులో ఎంత పని చేశాడో చూడండీ వెధవ! పగ పెంచుకుని, దాని ప్రాణం తీసి, నా కొంప ముంచుతాడనిమాత్రం ఊహించలేదు, బాబూ! కలలో కూడా అనుకోలేదు. . . ఛీ. . . మనిషికి మంచితనం చూపకూడదు" అంటూ వెక్కిళ్లు పెట్టి శోకిస్తున్నా రాయన.

పాపా, నా మట్టిబుర్రకి అప్పటికిగాని హెడ్‌క్లర్కు మంచితనం జ్ఞాపకానికి రాలేదు. వచ్చేసరికి పరిస్థితి నా చెయ్యి దాటిపోయింది. భుగభుగమండిపోతూన్న నా మనసు సెగతగిలి నా కంటినీరు ఆవిరిగా మారి గాలిలో కలిసిపోయింది. ఆయన కూతుర్ని గూర్చిన నిజం, ఆమె కాలుజారిన విషయం, నన్నాయన ఆమెను పెళ్లి చేసుకోమని బలవంతపెట్టిన వైనం, ఆత్మహత్య చేసుకుంటానని ఆమె అన్న మాటలు, ఆయన ఓదార్పులు — ఇవన్నీ నేను చెప్పినా అక్కడెవరూ నమ్మరు. మీదుమిక్కిలి కథలల్లుతున్నానంటారు. రాత్రి ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుందేమో, అది తెలిసిన మానేజరు భయపడి, నిందనుంచికూడా దూరం కావడంకోసం, ఆ పిల్లను చేసుకోనన్నందుకు నామీద పగ తీర్చుకోవటంకోసం, ఆ నెక్లేసు తెచ్చి రాత్రి నన్ను క్షమాపణ కోరే నెపంతో వచ్చి, అది నా గదిలో మూల పడేసిపోయి, హత్యాపరాధాన్నికూడా నామీద తోస్తున్నాడేమోనన్న వాస్తవాన్ని నేను పొరపాటునయినా నోరు జారిఅంటే ఏం జరుగుతుందోనన్న అనుమానం అక్కర్లేకుండా ఊఁ అంటే ఉరికేద్దామన్నట్లు చూస్తున్నారంతా నావైపు. అప్పటికే నేను పాత కె. డి.ని. అప్పుడు అందరి దృష్టిలోను హంతకుణ్ణికూడా.

"నేను నీకేమి అపకారంచేశానని నా గొంతు కోశావురా అప్రాచ్యుడా!" అని అతి సహజరుద్ధ కంఠంతో నా చొక్కాకాలరు పట్టి ఊపుతూ, కడవలకు కడవలు కన్నీళ్లు కారుస్తూన్న మానేజరు అక్కడ

అందరి సానుభూతులకు, దయకు పాత్రుడ్వై ఉండగా, లోకంలో మంచితనం పేరుమీద జరుగుతూన్న దుర్మార్గాలకు, మహాఘోరాలకు వరసన తగిలిన తీవ్రాఘాతాలకు మొరటుదేరిపోయిన నా ముఖాన్నికాని, కన్నీరంతా ఆవిరై పోగా, క్రౌర్యానికి ప్రతినిధుల్లా ఉన్న కమిలిపోయిన నా నేత్రయుగళినికాని చూసి జాలిపడే దెవడు? నేనెవర్నీ నమ్మించడానికందుకే మరి ప్రయత్నించలేదు. "నన్ను వేగం ఈ మానేజరుముందునుంచి బయటకు తీసుకుపొండి. అతడి మంచితనం నన్ను మాడ్చేస్తూంది" అనిమాత్రం చెప్పాను. మానేజరు నావైపు పదోకలా చూశాడు. నేను నవ్వాను. అది చూసి అతను మరింత భయపడినట్లు కనిపించాడు. నా దృష్టిలో అతడి కదే శిక్ష! నన్ను లాక్కెళ్ళారు. లాంఛనప్రాయంగా కోర్టులో కేసు నడిపారు. ఆమె హత్యచేయబడిందనీ — ఆమె కడుపులో దిగబడిఉన్న బాకు నాదేననీ సాక్ష్యం చెప్పారు పెద్దలంతా. ఏడవడానికి కన్నీరు కరువైన నే నన్నిటికీ నవ్వేశాను. 'మంచితనపు గోతుల లోతుల కొలతలు కనిపెట్టినందుకు నాకెవ్వరూ డాక్టరేటు డిగ్రీ అయినా ఇవ్వరేం చెప్మా' అనుకునేవాణ్ణి పిచ్చిగా.

పాపా, ఇదుగో ఈరోజు మళ్ళీ నన్ను వదిలేశారు, మంచితనం మజా మరోసారి చూసి తిరిగి వచ్చెయ్యమని. కాని, నేను విసిగిపోయాను. పాపా, సంవత్సరాల తరబడి లెక్కించిన జైలుఊచలను మరి తిరిగి తిరిగి లెక్కించలేను. ఇందు కొక్కటే మార్గం. నేనే లేకుండా అయిపోవాలి! నా మనస్సంతృప్తి, నేను నిష్కళంక జీవి నన్న దృఢవిశ్వాసం నాలో హరించిపోకుండా ఈ లోకం నుంచే సెలవు తీసుకోవాలి. అందుకే నీకారు క్రింద. . ." రాజారావు శూన్యంనుంచి దృక్కు లామెవైపు తిప్పాడు. ఆమె అశ్రుధారను తుడుచుకుందామన్న ప్రయత్నమైనా చెయ్యకుండా మూగబొమ్మలా చూస్తూంది.

"విన్నావుగా, పాపా! నీ మనస్సు నిజాలే చెబుతూందని మరోమారు ధైర్యం కలిగిందా? నీ నిర్ణయాల్ని ఇక ధైర్యంగా అమలుపరుచుకో!" రాజారావు తన బాధ్యత తీర్చుకున్నట్లుగా నిట్టూర్చాడు.

ఆమె తెప్పరిల్లి, కనులు తుడుచుకుని ఓ నిమిషం ఆగి తిరిగి ఇలా అంది: "తాతా! నువ్వు చెప్పిన నీ గాథతో నాకు కావలిసినంత మనస్థైర్యం వచ్చేసింది. అందుకు సదా కృతజ్ఞురాలిని. నేనా యువకుని తప్పక వివాహం చేసుకుంటాను. అతని జీవితంలోకూడా కొన్ని అగాథాలున్నాయి. వాటిని నేను నీతికి ప్రతీకలుగా నిర్ణయించుకున్నాను. కాని, అతను నన్ను మరోమారు మనస్ఫూర్తిగా ఆలోచించుకుని సరిఅయిన నిర్ణయానికి రమ్మని చెప్పాడు. చాలు. ఇక నా కాలోచన అవసరంలేదు!"


"చాలా సంతోషం, తల్లీ. ఇక వెళ్లనా?" అంటూ మళ్లీ లేచాడు రాజారావు. ఆమె అతని రెండు చేతులూ పట్టుకుని "ఊఁహూఁ వీల్లేదు" అంది మారాంచేస్తున్నట్లుగా. అతని ముఖం తిరిగి భయాన్ని పులుముకుంది.

"నన్ను వెళ్ళనియ్యమ్మా . . . నన్ను వెళ్లనీ! మంచితనపు సెగలో మసిబారిపోయిన నాకు మంచితనమంటే గడగడ వణుకు పుడుతూంది. నువ్వు నామీద నిజమైన సానుభూతి చూపావా లోకం నిన్ను తప్పక బాధిస్తుంది. అదీ నాకు కష్టమే!" అన్నాడు బిక్కముఖంపెట్టి.

"ఎవరేమనుకుంటే అదనుకోనీ! నిన్నుమాత్రం వెళ్ళనివ్వను, తాతా నీ జీవితాన్ని సర్వనాశనం చేసిన దౌర్భాగ్యుల దౌష్ట్యాన్ని నాకు చేతనయినంతగా విడమరిచి చెప్పి ఈ లోకం కళ్ళు తెరిపిస్తాను. నువ్వు నాతోనే ఉండిపో! నాకెంతో ధైర్యంగా ఉంటుంది. నువ్వుమాత్రం ఎక్కడికీ వెళ్ళడానికి వీలులేదు. నీ పాప మంచితనంమీదకూడా నీకు నమ్మకంలేదా, తాతా!" అదేదో విడివడని సంబంధం ఇద్దరిమధ్య ఉన్నట్లు చెబుతూ, అదోలా జాలిగా చూసిం దామె. ఆ చూపులోని చల్లదనం మంచుతెరలా కప్పేసింది రాజారావుని. కర్తవ్యతా విమూఢునివలె శూన్యదృక్కులు వరపుతూ తల వంచుకున్నాడు.

"మంచివాడివి, తాతా! నీ పాప మాట విన్నావు. అంతే చాలు" అంటూ తేలికగా, తృప్తిగా, మనస్ఫూర్తిగా నవ్విం దామె.

రాజారావుకూడా ఎందుకో తనలో తాను నవ్వుకున్నాడు.




చిత్రం — కె. ఎస్. రెడ్డి (సికిందరాబాదు)

బయట వరండాలో పట్టెమంచంమీద జంబుఖానా పరిచి, ఒక తలగడ ఇచ్చి రాజారావుని పడుకోమని చెప్పి తాను లోనికి వెళ్లి తలుపు వేసుకుం దామె.

తెల్లవారింది. ఆమె తలుపు తీసింది. వరండాలో మంచంమీద రాజారావుకి బదులు ముత్యాల్లాంటి అక్షరాలతో నిండిన ఆకుపచ్చ కాగితంమాత్రం మిగిలింది.

"నా చిన్నారి పాపా! చెప్పకుండా వెళ్లిపోతూన్నందుకు మన్నించు. చెబితే నువ్వు వద్దంటావు. నే నెదురు చెప్పలేను. తాత ఏమయ్యాడోనని వ్యథ చెందకు. నే నీ లోకాని కతీతుణ్ణయిపోతున్నాను. నా గమ్యానికి చేరుకుంటున్నాను. ఈ వేళ నా యాభైయవ పుట్టినరోజు. నీలాంటి అమృతహృదయ ఆదరం, ఆతిథ్యం లభించాయి. అది నా జన్మజన్మలకు మరవలేను.

నిష్కల్మషహృదయంతో దేవుడు నీకు మేలు చెయ్యాలని ప్రార్థిస్తున్నాను. తప్పక వింటాడు. నీకు మేలు జరుగుతుంది.

నీమాట వినకుండా వెళ్లిపోయానని బాధపడకు. చెక్కుచెదరని ఆత్మసంతృప్తితో నీ తాత ఆనందంగా ఈ లోకాన్ని వదలి పోయాడని, ఇక అతని నీ లోకమేమీ చెయ్యలేదని సంతోషించు. నిన్న రాత్రి నిన్ను కలుసుకోవడంవల్ల నేనొక పాపంనుండి రక్షింపబడ్డాను. ఎవరి కారుకిందైనా పడితే వాళ్లనవసరంగా నావల్ల కొంత బాధపడతారు. అది పాపమే కదా. నీవల్ల అది తెలుసుకున్నాను నేను. అందుచేత ఎవరికీ ఇబ్బంది కలుగని విధంగా, నిందరాని విధంగా పోతాను.

పాపా! నీ మంచితనం చూశాక హెడ్‌క్లర్కు జ్ఞాపకంవచ్చి వెళ్ళిపోయాననిమాత్రం అనుకోకు. నేను నిజంగా నీమంచితనానికి చేతులు జోడించాను. కాని, పాపా! నాకే భయం. తీరా నే నా మంచి ఆశిస్తే అమూల్యమైన నీ మంచితనాని కేమి కళంకం వస్తుందోనని. నీ విషయంలో అలా జరిగితే నేను భరించలేననిపిస్తుంది. అందుకే వెళ్లిపోతున్నాను. నీ మంచితనంనుంచి ఇంతవరకూ నేనేమీ నష్టపోలేదు. కష్టపడలేదు. ఈ ఆనందాన్ని ఇలాగే ఆస్వాదిస్తూ హాయిగా కన్నులు మూసుకుంటాను. కన్నీరుకార్చకు, పాపా. సెలవు.

ఇట్లు,
అభాగ్యుడైన నీ తాత."

అని ఉంది దానిలో.

"కన్నీరుకార్చకు, పాపా." మరోమారు చదివిం దామె. "తాతా . . . తాతా . . . ఇవి కన్నీళ్లు కావు . . . ఆనందబాష్పాలే సుమా!" అంటూ వెర్రిగా నవ్వింది పాప. ఆమె కంటినుండి మెరిసిన ముత్యాలవర్షం, ఆమె నవ్వుకి తాళంవేస్తున్నట్లుగా కురిసి కాగితాన్ని తడిపింది. ★